# నిదరక్క లత

"ఈఈర ఏసా లేసీ ఈరు దనిపించుక ఈరసొరగానికె పోయినావో, ఓ గుర్రాల గోపిరెడ్డి సీగీపే మో సూడనవునా"

'ఎహె! ఎహె! దినమూ గారాబ మయితే ఎట్టా? రా ఈతలకి! ఆళ్ల తోటతో నీకేం పనీ! ఈపు సెడ్తుందా బుద్ధిం దక్కర్లా?'

మిగతా నలభై తొమ్మిదిమంది ఒకెత్తూ, ఆ గేడి కొమ్ముల మాలచ్చి ఒకెత్తూ, కోడెదూడ్ల కుటుంబానికి సంబంధించి దవటాన 'ఎంత గారాబమైతే మటుకు, పైపలారాలు ఎక్కువై పద్దాక దొంగతిండికి యగడ్తుంటే నామర్దా ఓడికీ? తోటిమంద దార్న తోటిగా పోతుంటె, ఏందో మాపని వుండట్టు ఆళ్లతోటకాదె తారెట్టాడటం దేనికీ? అస లా సుబ్బిముండ వూరకుంటదా! ఆ ఏనాదా ఏందో తేలవక్కర్లా?'

అసలు గోపాయికి తన ఆవులమందంటే సెడ్డ పానాబిమానం. బడి ఎగ్గొట్టి మందలె ట పోతుంటే, పంతులోడు నాగుమల్లెబెత్తాలు ఆవజాన ఒంటిమీన యిరుత్తుండా, మందమీన మనసు మల్లలా. సిలక, పచ్చి, గేద్ద, బెమ్మ, వీస్పెరుడూ, ఇయ్యన్నీ పలకనోల్లగాకుంటే పంతులోడు కొట్టటం అటుంచి, పక్క పిల్లెదవలు లేవిడికొడ్తంటే, సాటున సూసి ఒక్కొయదవను మత్తబెట్టి తంతే, ఒల్లు వూనం వూనంసేసి బల్లోనుంచి సాగ నంపినా తనకేం సీమకుట్టినట్టు కూడా వుండలా. తనమాటంటే మందకు గురి. ఆటిని తను అరదం సేసుకో గలడు. ఎప్పుడన్నా కోపాన కేకలేత్తే, ఆలకంటా ముట్టిలు నాక్కుంటా ఓ దాని కోటి సాటు సేసుక ఓరకన్నుల సూత్తా ముద్దులు కురిపిత్తయి. గీతగీసి గుడుగుడు బల్ సెడుగుడు అంటమే సాలు, బసవడూ, కొండడూ, నందులూ, తోకలెత్తుక చెంగనాలేత్తా, వుఁయ్, వుఁయ్, వుఁయ్, అంటా కూతల్లే గురకపెడ్తా, అంతాకల్బి అటూ ఇటూ లగెత్తుకుంటా ఆడుకుంటంటే తనకింకో పెపంచకంతో పనక్కర్లా. కోడెదూడల గోపాయని, కోతి గోపాయని, తనకు మందతోటే సరని, తన్నంటం దేనికీ? మొదలు యీమాలచ్చాంకి నోరు గల అనగందే! ఆ యానాద్దాని తోటలోనే వున్నయ్యేట్టా పరమాన్నాలన్నీ? పానీ పెద్దముండ పోయిందే అనుకో, తనుమటుకు కాత్తై మెతగ్గా పో నక్కర్లా? ఆదుకోను రా బొయ్యాడుకూడా, సేత గానోళ్ల తోటసాయల కెందుకు రావాలా? ఆ దావిదంగా మిడిసిపడ్తంటే నాకేం సెవుల్లేవా? దీని ఏనాది యవారమేందో మొదలంట సూడక్కర్లా?

సమువుసంగ తేండో తేలిపోటాన, గొడ్డకాడే పడి సావమని అయ్య సెప్పినాక, పరాయిసోట్లకు పెంటకట్టను పెద్దమందలు పోగా, మిగతా ఇంటికాడ కరుజుగ్గాను మిగిల్న సిన్నమంద గోపాయి ముద్దుకు చరీపోయింది.

ఏదెట్టునా్న ఆ మామిడితోట అంకాయి కూతురు సుబ్బితో వచ్చిందిసావు. తనోపక్క దిబ్బలమీన సెట్టుకింద కూకుని, మంద నెమరేత్తుంటే, సల్లగా ఆ పదాలు యీ పదాలు పాడుకుంటుంటే, తోటనుండి తనుకూడా ఎక్కిరిత్తా పాట్టం దేనికీ? మందసాయకు రానీ నడ్డి ఎగురుద్దీ!

గేడి కొమ్ములా మాలచ్చింవికి
గెంతులేసే వగలదూడ.
గెజ్జ లున్నా తిరుపతమ్మకు
గల్లుమనే మువ్వలదూడ.
గాజుకన్నులా గంగారమ్మకు
నాజూకైనా నిగలదూడ.
ఓ కోలమొగమూ
పిట్టనడుమూ
పైడి బిగువూ
మట్టె మీటలా
నాత్తె మాడే
వుబు కుబుకుల పిల్లా!
సెయిగలిపి సిందులేసుతా
దూడలెంటా దూకిపోదామా.

'యాడ నేర్చావయ్యా యీపదాలూ?'

ఓసి దీనికడు పుడకా, రానే వచ్చింది, ఓ పచ్చి మాయిడికాయ కొరుకుతా ఒయ్యారంగా.

'పదాలు మాజోరుగా యిసుర్తున్నావే?'

'నీకేం యిసురుకుంటే? పో'

'పోటానికి నూ సంపాయించావా యీ సోటూ?'

'నూ సంపాయించావా?'

'నూ సంపాయించావా?'

'తగు వాడాల నుందా?'

'నువ్వే తగు వాడ్తుండావు.'

'మొదులు నా వూసెందుకు నీకూ?'

'పదాలు బాగుంటే యింటాని కొచ్చా, తప్పా?'

'వూఁ. తప్పలా, తోటకాడుండి కొక్కిరిత్తా, కోతల్లే?'

'నువ్వేఁ కోతివి. నువ్వేకొండముచ్చువు కావఁలు.'

'ఆఁ రోజూ అంటల్లా, యియ్యాల కొత్తేముందీ? మాలచ్చిని సావనూకీ!— ఆడగూతురికి అంత పొగురుం డక్కర్లా.'

'ఓమ్మో, ఓమ్మో! మాలచ్చిని సావ నూకానూ? ఎం తన్యాయం? అందుగ్గాదూ కోతినంటా? లేకుంటే పతిరోజూ ఆవజాన ఎగబడి సిన్నసిన్న మొక్కనంతా యిరగ దొక్కుతుంటే, తోటోళ్ల గతేంగానూ? కొత్త జెదురు పెడ్తే సావకొట్టినట్టేనా లెక్కా?'

'ఎమో ఎవుడు సూశాడూ మాలచ్చి ఆవజాన ఎగరొప్పుతా వత్తే యామనుకోవాలా?'

'ఏం అనుకోకుంటానికి తోట మట్టిన కొట్టిక పోవాలంటావు?'

'తోటసంగతి ఓడికి కావాలా, నన్నుమటు కంటల్లా మాటలూ?'

'ఏమన్నారయ్యా, సిన్నపిల్లాడల్లే ముద్దులు కుడుత్తుండావూ?'

'నూ పెద్దదానివి కాబట్టేగా ఆమాట యీమాట అంటం?'

'నూ మటుకు పొల్దాగుతుండావా? అన్నీ తెలుసు నీకూ.'

ఆడనే కూకుంది సెట్టుసాటుగా మాయిడికాయ కొరుకుతా. ఏందో తిరుగుడుగా వుందిగాని, అదేందో అంతు పట్టటంలా. తనికీసేసి సూత్తే తన్ను తిట్టిద్దనే యవారంగా ఆపట్టల్లా. అసలు కతేందీ?

'మాయిడికాయ తింటా, యిత్తానూ?'

'నువ్వే తిను, నాకేం అక్కర్లా.'

'ఎందుకయ్యా అంత కోపం? ఎవురే మన్నారూ?'

'ఆఁ, ఏమన్లా, రోజు ఆవజాన ఏడిపిత్తా?'

'నీకు కోపం రాకుంటే, ఎందుకొత్తాను యీడకూ? నువ్వేందో, నీగోలేందో, పక్కమడుసుల సంగతేందో కనుక్కోక్కర్లా? ఎన్నాలయ్యా ఈ గారాబం?'

'వుప్పుడు, నూ నన్ను గారాబం సేత్తుండా వెట్టా?'

'పోరా నీక సలు తెలువదు! ఓపాట పాడు. బాగా పాడ్తావే! ఇందాకేంవీ మంచిపాట పాడ్తుండావూ?'

'ఎందుకమ్మా కొక్కిరియ్యలినా? నే పాడను ఫో.'

'నేనేం అననుగా. కాత్తె పాడ్తె, ఇంతలో ఏం తింటారయ్యా నీదీ?'

'నిన్ను నమ్మిందెవుడూ! ఆవజాన తిట్టీ? నే గొడ్డకు నీలుబెట్టి యింటికి పోవాలి, ఫో.'

'ఆఁ, కూకో పెట్టీ జడేసి పూలుదోపుతా రా!' మూతిముడుసుక లెగిసి గబగబపోయింది. మందను నీలుతాపి, ఆడీడ మేపుకుంటా, కొంపకు సేరుకుని ఆ రేతిరి కలత నిదర పొయ్యాడు గోపాయి.

*   *   *

మరసనాడు... ... ... ...

మామిడిపిందెలు పండవొచ్చే
మామిడికొమ్మలు నేలకొరిగే
మామిడోళ్ల పిల్లా పళ్లు ఏసుక పగలబడే
ఓ మామిడోళ్ల సిన్నికూతుర
మామిడిపళ్ళకు మనసు తెలసెనే.

తోటకాడికి వచ్చేతలికి, టపీమని ఓ మాయిడికా యొచ్చి ఈపున గుద్దది. కంచెపక్క సెట్టుమీనగా కూకుని సుబ్బి పచ్చిలా కిలకిల నవ్వుతుంటది.

'ఏందా ఒల్లుపొగరూ, మళ్ళీ నిన్ను కొడ్తే?'

'ఆఁ కొట్టావులే సప్పట్లు. మ రా పాటేందీ?'

'నీకేం పాడుకుంటే, నువు యింటావని కల గన్నానా?'

'(కిలకిలమంటా) ఎందుకయ్యా అట్ట బయపడి సత్తావూ నేనంటే? తమాశకంటాగాని, నువంటే పానంగాదూ! సెట్టుమీన కొత్తే ఓ దోరపండు మంచిదిత్తా, వత్తావా?'

'నే రానమ్మా.'

'ఏం చెయ్యన్లే, రా రా, మంచి పండుంది కోద్దాం?'

'ఏమో నిన్ను నమ్మం దోడూ!'

'పానీలే యింతేకదూ!'

'మరి యాడుందీ పండూ?'

'ఈడ ఈకొమ్మ నుందిరా, కోసుకుని ఈడెనే తిందాం సప్పున రారా!'

గబగబ గొడ్డను ఆకుప్పలెంటా ఈకుప్పలెంటా తోలేసి కంచెదాటి సెట్టు మీనకెక్కి—

'యాడమ్మా పండూ?'

'ఏ పండూ?'

'మాయిడిపండు కొమ్మనుందంటివే! ఎందుకమ్మా యిష్టేడిపిత్తావూ ?'

'యాదవకురా, పసిపిల్లోడల్లే! ఎన్నాలురా నీకింకా ఈ గారాబం, పెద్దాడివి కావటల్లా ?'

'అబద్దాలాడీ, నాకు తెలవదూ నమ్మకూడదనీ.'

'వుండరా. అబద్ధం కాదురా. అదుగో ఆకొమ్మ సివర్నా; నువ్వీ దోటీ పట్టుకలాగూ, నే అందుకుని కోసిత్తానూ, అంత ఒడుదుడుకవుతే ఎట్టా ?'

దోటీ తీసుక కొమ్మకేసి లాగి పట్టుకుంటే, జాగరత్తగా పాకి పడకుండా కోసుక తెచ్చింది.

'సూశావా ఎంతమంచి పండో! ఈ కొమ్మమీన కూకుని తిందాం.'

'ఇట దే, నే కోసిపెడ్తా, నా కాడ ముల్లు కత్తి వుంది'

'నీ ఒల్లు యింత కాల్తున్నదేరా ?'

'ఏమో నాకేం తెల్బా, అ దంతేలే.'

'సరేగానీ, ఓపదం పాడవూ ?'

'నూ పాడరాదూ ?'

'యిద్దరం పాడ్దాం, ఏం ?'

'ముందు నూ పాడ్తావా ?'

'ఆ, యిక్కడకాదు, కిందికిదిగీ ఆ దుబ్బులా గుండలా వౌదా? అందులో ఎంత సల్లగావుంట దనుకుండా? దిగు సూపిత్తా ఎంత బాగుంటదో.'

* * *

మంద మందంతా గోపాయిని ఎమకుతా తోటలో జొరబడ్డయ్. యాడనుంచి సూశాడో ఎంకడు, పెద్ద కర్రోటి తీసుక, ఒక్కొక్కదాన్ని బాత్తుంటే, ఓ దారంటూ తెలవక మంద మందంతా ఆపౌదమీన నజ్జునజ్జుగా లగెత్తినై...

ఒక రేత్తిరేల పక్కమీన కూకుని పెద్దపెట్టున ఏడుత్తుంటే, ఆళ్లమ్మ యీపు సరిచి బెదురుపోగొట్టినా, దడుపుజరాన, ఓ నెలరోజులు పడుకున్న మంచంలోంచి లెగవలా గోపాయి.

★